# నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT

# ఆదిలాబాద్

శనివారం 25 నవంబర్ 2023
SATURDAY, NOVEMBER 25, 2023

ADILABAD

పేజీలు : 8
PAGES




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

## రాహుల్ ప్రచారం రద్దు చేసుకోవాలి..

- ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తకు ఎలా ప్రచారం చేస్తారు..
- పార్టీ సిద్ధాంతాలు ఏమయ్యాయి
- మాజీ కాంగ్రెస్ నేతల మండిపాటు
- సస్పెన్షన్‌ను కామెడీగా అభివర్ణించిన నాయకులు

..2లో

మంచిర్యాలలో ప్రజా ఆశీర్వాదం



# గోదావరి మీద కరకట్ట కట్టిస్తాం..

..2, మధ్యపేజీలో

## వచ్చే ఎండాకాలంలోనే మొదలుపెట్టి పూర్తి చేసుకుందాం..

- పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే వాడ కట్టుకో పేకాట క్లబ్ వస్తది
- ఇళ్లు అమ్ముకొని పేకాటలో పెట్టే రోజులొస్తయ్.. తస్మాత్ జాగ్రత్త..
- కాంగ్రెస్సాయన బీఆర్‌ఎస్‌లో చేరుడనేది ఝూటా ముచ్చట
- సింగరేణి కార్మికుల హక్కులను కాపాడుతున్నది బీఆర్‌ఎస్ సర్కారే..
- దివాకర్‌రావును గెలిపించండి.. మంచిర్యాలకు మంచే జరుగుతది..
- మంచిర్యాల నియోజకవర్గ 'ప్రజా ఆశీర్వాద సభ'లో సీఎం కేసీఆర్

"మంచిర్యాల పట్టణంలోని శివారు కాలనీలకు గోదావరి నీళ్లు వస్తున్నాయి. ఆ నీళ్లు రావద్దంటే గోదావరి మీద కరకట్ట కట్టాలి. మీరు మంచిర్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి దివాకర్‌రావును గెలిపించండి. చుక్క నీరు రాకుండా చూసే బాధ్యత నాది. ఆ పని కూడా లేట్ చేయకుండా చేస్తాం. అవసరమైతే వచ్చే ఎండాకాలంలోనే మొదలు పెట్టి పూర్తి చేస్తాం.." అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద సభ'లో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెసోళ్లకు ఓటు వేశారనుకో వాడ కట్టుకో పేకాట క్లబ్ వస్తదన్నారు. ఇండ్లు అమ్ముకోవడం, పేకాటలో పెట్టడం తప్పా.. ఏమి అభివృద్ధి జరగదని పేర్కొన్నారు. ఇది చాలా ప్రమాదకరమని, కుటుంబాలు కూడా దెబ్బతింటాయని హెచ్చరించారు. సింగరేణి కార్మికులకు కారుణ్య నియామకాల కింద 15 వేలకుపైగా ఉద్యోగాలిచ్చామని, ఇల్లు కట్టుకోవడానికి రూ.10 లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చామని, లాభాల వాటా, దసరా, దీపావళి బోనస్ రూ.1000 కోట్లు పంచామని గుర్తు చేశారు. ప్రతి సింగరేణి కార్మికుడికి రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షలు రావడం సంతోషమని పేర్కొన్నారు.

- మంచిర్యాల, నవంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కాంగ్రెసోళ్లు ఎట్లాగు గెలుస్తలేం ఓడిపోతున్నమని.. కొత్త స్టైల్ మొదలు పెట్టిన్రు. నన్ను గెలిపించండి బై.. నేను కూడా బీఆర్‌ఎస్‌లనే జాయిన్ అవుతానని చెప్పుకుంటున్నట్లు తెలిసింది. అదంతా ఝూటా ముచ్చట. ఏదన్న లంగతనం చేసి గెలవాలనే బద్మాష్ గిరి తప్ప అది వాస్తవం కాదు.

సింగరేణి కార్మికుల జీవితాలు దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లు ఉంటది. వాళ్లకు ఇన్‌కం ట్యాక్స్ మాఫీ చేయమని నరేంద్ర మోదీకి అసెంబ్లీలో తీర్మానం చేసి ఎప్పుడో లేఖ పంపించినం. ఆ మోదీ చేస్తలేడు. గతంలో లాభాల వాటా 16 శాతం ఉంటే.. దానిని ఇవాళ 32 శాతం చేసుకున్నం.

యుద్ధానికి వెళ్తున్నప్పుడు కత్తి ఒకని చేతుల పెట్టి.. యుద్ధం ఇంకొకడిని చేయమంటే నడుస్తదా. ఎవడైతే మన కోసం యుద్ధం చేస్తడో వాని చేతికి కత్తి ఇచ్చి యుద్ధం చేయమనాలే.. అందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థి దివాకర్‌రావును కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించండి.

### మంచి మనిషిని గెలిపించండి..

దివాకర్‌రావు సౌమ్యుడు. మర్యాద మనిషి. పైరవీలు చేయడు. నాకు అంతర్గాం బ్రిడ్జి కావాలే.. నాకు గూడెం లిఫ్ట్ పక్కన ఇంకో లిఫ్ట్ కావాలే.. పొలాలకు నీళ్లు కావాలే.. ఇవే నా వద్దకు వచ్చి అడుగుతడు. దయచేసి ఒక మంచి వ్యక్తి గెలిస్తే, మంచిర్యాలకు లాభం జరుగుతది. మంచి గవర్నమెంట్ వస్తది. చెడ్డ ఎమ్మెల్యే గెలిస్తే చెడ్డ గవర్నమెంట్ వస్తది. ఆగం కావద్దు. ఆలోచించి ఓటు వేయాలే.

- మంచిర్యాల సభలో సీఎం కేసీఆర్



జనాలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్ రావు